# బలిపశువు

రచన:
శ్రీ ఎం. వి. జె. భువనేశ్వరరావు

'చిన్నమ్మా....చిన్నమ్మా! అన్నం పెట్టవూ?' అనే భావంతో నోటి నుండి రాని మాటలతో, చేతుల ద్వారానే సంజ్ఞలు తెలియజేస్తున్నాడు రాము.

'వెధవా....ఇదేం అనాధ శరణాలయం అనుకొన్నావా, అడ్డమాని వాళ్ళని పోషించటానికి? ఇప్పటి నుంచి యీ గడప తొక్కావంటే చూడు ...నరికి పోగులు పెడతాను!' అంటూ కాలితో తన్ని వెళ్ళిపోయింది సత్యవతి.

'చిన్నమ్మా....నువ్వు తాకపోతే ఎవరు చిన్నమ్మా? ఇంత బువ్వ పెట్టు చిన్నమ్మా!' అనే భావలతో వెనక్కి వెళ్ళి కాళ్ళు పట్టి బ్రతిమలాడుతున్నాడు రాము.

'తంతే ఇంకా కాళ్ళు పట్టుకొని లాగుతావా ...వెధవా! పోతావా....పోవా? ...' అంటూ కర్రతో చావ బాదింది సరస్వతి.

'ఏమిటే....ఏం చేశాడే?' అంటూ అప్పుడే పొలం నుండి వస్తున్న రామారావు లోపలికి వచ్చాడు.

'వీడికి అన్నం పెట్టాలట! ఏ రైల్లోనో, ఏ బస్స్టాండ్ దగ్గరో అడుక్కో పోయి....ఇక్కడికి గాని వచ్చావా - డొక్క చీలేస్తాను....దొంగ వెధవ!' అంటూ లోపలికి పోయింది సత్యవతి.

'రాము నోరులేక మాట్లాడలేదు. అయినా సంజ్ఞల ద్వారా తెలుపుతున్నాడు. కాని రామారావు మాత్రం నోరున్న బాధను మాట్లాడలేని నిస్సహాయ స్థితిలో ఉండి పోయాడు.

రాము నోరున్న వెర్రోడు....మూగ....నాలుక వున్నా మాటలు రావు. అది చాలదన్నట్లు కుడిచెయ్యి సొట్ట.... తల్లి ఉన్నంత కాలం ఎంతో గారాబంగా పెరిగాడు. కాని అతని దురదృష్టం తల్లిని కాటేసింది....

ఐదేళ్ళ చిన్నతనంలోనే తల్లి ఈ లోకం విడిచి వెళ్ళి పోయింది. మాటలు రాని మూగతనంలో - చేతులు రాని సొట్టతనంలో తల్లిలేని పరిస్థితివలన....తండ్రి నిర్లక్ష్యం వలన సవతితల్లి సత్యవతి అనే సూటి-పోటి మాటలకు గురియవుతూ, పరిస్థితులలో రాజీ పడలేక సమాజానికి పనికిరాని నిస్సహాయ స్థితిలో వుంటూ, చావలేక బ్రతుకుతున్నాడు రాము. తమ్ముడ్ని - చిన్నమ్మ చీవాట్లు పెడితే చూడలేడు....తనకది ఇష్టం లేదని చెప్పలేక చిన్నమ్మమీద కోపంతో రాయి విసరబోతాడు. కాని చిన్నమ్మ కోపాగ్నికి గురియై చావుదెబ్బలు తింటాడు. తనెన్ని బాధలు పడినా ఆరేళ్ళ రంగడు బాధ పడటం సహించలేడు. సమాజానికి ఉపయోగ పడదామనే తాపత్రయంతో, రోడ్డు ప్రక్కన ఉన్న రాళ్ళు, చెత్తవున్న ఒక్క ఎడమ చేతితోనే పోగులు పోగులు పెడతాడు. ప్రొద్దుట నుండి సాయంత్రం దాకా పోగులు పెట్టిన రాళ్ళని ఏ రమణమ్మో పది పైసలో, పావలనో యిచ్చి పట్టుకు పోతుంది. ఆ పది పైసలను ఎంతో జాగ్రత్తగా పటుకెళ్ళి చిన్నమ్మ కూతురు మణికి యిస్తాడు. చిన్నమ్మ చెంప దెబ్బలకు కళ్ళబడి కన్నీళ్ళు కారుతున్న మణికి మిఠాయి పెట్టందే మనస్సుకు ఊరట కలగదు.

సత్యవతిని రెండో భార్యగా తెచ్చుకొన్నాడు రామారావు. సత్యవతి వచ్చిన దగ్గర్నుంచి మొదటి భార్య పిల్లలయిన రాముడ్ని, రంగడ్ని ప్రేమగా చూడటమే మరచిపోయాడు. వీళ్ళ పరిస్థితిని చూడలేక ఏదో అనబోతాడు. అంతే.... సత్యవతి ముందు నోరైనా ఎత్తడు....ఏ రహస్యంగానో రూపాయో, పావలానో యిచ్చినా రాము తనొక్కడు తినలేక మణికి తెచ్చి పెడతాడు.

చిన్నమ్మ దెబ్బలాడిన దగ్గర్నుంచీ రాము మనసేం బాగా లేదు. రోజూ చిన్నమ్మ దగ్గర చెంపదెబ్బలు తినలేక ఎక్కడో భిక్షమెత్తుకోవడమే మంచిదని ఇల్లు విడిచి వెళ్ళి పోయాడు. ఎటు వెళ్తున్నాడో తనకే తెలీదు. తెలిని దారిలో....తపస్సు చేస్తున్న ఋషిలా పోతున్నాడు. దారిలో

The first and the only Agitator Type
WASHING MACHINE

SANGEETHA
● Design based on Foreign Technology
● Zig Zag Agitator movement ensures best and safety washing
● Works without water seal
● Guaranteed for 5 years
EMPIRE INDUSTRIES
5 - Corpn. Shopping Complex
Jail Road Coimbatore 641 018.

కనిపించే వారందరినీ 'బాబూ....ధర్మం!' అని అడుగుతున్నాడు. 'బాబూ-ధర్మం' అన్న మాట నదీప్రవాహంలా ఉప్పొంగిపోతున్న కన్నీటి వరదలు గల-గల శబ్దంగా విన్పిస్తోంది. బస్‌స్టాండ్‌ల దగ్గర, రైలుస్టేషన్ల దగ్గర అందర్నీ అడుక్కోవడం అలవాటై పోయింది. రాముడు రైలు స్టేషన్‌లో ఎవరేనా బేగ్‌లు మోసుకు రమ్మంటే, ఉన్న ఒక్క చేత్తోనే మోసుకు వెళతాడు. నమ్మకంగా వుంటూ, వాళ్ళ దయతో రూపాయో, రెండు రూపాయలో పొందుతాడు. అప్పటికి భోజనమదే....!

ఒకరోజు ట్రైన్ బయలుదేరటానికి యింకా అయిదు నిముషములు మాత్రమే టైముంది. అప్పుడే ఆదరా-బాదరాగా మూడు సూట్‌కేసులు, నాలుగు బేగ్‌లు పట్టుకొని ఒకాయన ఆటోలో దిగాడు. గోదావరి ట్రైన్‌లో రిజర్వేషన్ చేయించుకొన్నాడు.

ట్రైన్ బయలుదేరేసరికి సిటీ బస్సులు రాక, ఆటోలో వచ్చాడు. తొందరగా వచ్చి ఎవరేనా సామానులు మోయటానికి వస్తారేమోనని 'ఏ మజదూర్!' అని పిలిచాడు. చుట్టూ ఎవరూ లేరు. అక్కడ కూర్చొనివున్న రాము అతనికి సహాయ పడదామని దగ్గరికెళ్ళి బేగ్ పట్టుకున్నాడు. దొంగేమోనని కొట్టబోయాడా పెద్దమనిషి. 'కాదు సార్! నేను మీకు సాయం చేస్తాను.' అని చెప్పటానికి నోరు లేదు. ముఖ కవళికలతోనే, చేతుల సంజ్ఞలతోనే చెప్పాడు తన వుద్దేశ్యం అయినా ట్రైన్‌కి టైమ్ లేక పట్టుకు రమ్మన్నాడు. రాము ఎడమ చేత్తోనే రెండు సూట్‌కేసులు పట్టుకొన్నాడు. ఆ పెద్దమనిషి ఒక్కడే వున్నాడు. కంపార్టుమెంటు చూపించాడు దానిలో దించమని. కంపార్టుమెంట్లో వుంచి, రాము మళ్ళీ తనిదగ్గరి కెళ్ళాడు. ఈసారి కూడా రాము రెండు సూట్‌కేసులు పట్టుకొన్నాడు. ఆ పెద్దమనిషి మూడు బేగ్‌లు పట్టుకొని ముందుకు నడిచాడు.

ట్రైన్‌కి సిగ్నల్ యివ్వబడింది.

ఆ పెద్దమనిషి కంపార్టుమెంట్‌తో బేగ్స్ పట్టుకొని అడుగు పెట్టాడు. ట్రైన్ కదిలి పోయింది.

రాము ప్రొద్దుటినుంచీ భోజనం లేక నీరసంగా నడుస్తున్నాడు. మూడడుగుల దూరంలో వున్నాడు ట్రైన్ కదిలేసరికి....

తొందరగా పరుగెత్తుకొచ్చి సూట్‌కేస్‌లు అందిద్దామనే వుద్దేశ్యంతో ఆతృతగా ఎక్కాడు. కుడిచేతితో హేండిల్ పట్టుకోబోయాడు. కాని కుడిచెయ్యి సొట్టవటం మూలాన పట్టుకోలేక క్రింద పడ్డాడు.

ట్రైన్ చక్రాల క్రింద ముక్క ముక్కలుగా చీలిపోయాడు. నర-నరాలలోని నరయాతన అంతమయింది

ప్లాట్‌ఫారం మీద మాత్రం రక్తపు బొట్లు ఆవరించాయి. రైలుకు బలిపశువైయ్యాడు.





మా ప్రత్యేక తయారింపులు!!

* డి. ఆర్. ఫైన్ * మాసర్
* బజాజ్ ఫైన్ * ఐలెట్
* కూల్ టెక్స్ * కాపిటల్
* సంగమ్ ఇంటర్‌లాక్ * ఓవిన్
* టిప్‌టాప్ * కింగ్ కాంగ్
* కైరాజ్ * రాకెట్

ఇవికాక * జెట్టీలు * లండన్ * సిమిత * బాబి
అన్నిరకాల కలర్ షర్టులు మరియు ఫాన్సీరకాలు
అన్ని ప్రముఖ బట్టల షాపులోనూ దొరుకును.

BAJAJ KNITTERS - Lakshminagar - Tirupur - 638 602.